క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో నాగపంచమి వేడుకలు



పార్కురోడ్డులోని నాగుల విగ్రహాలకు పాలు పోస్తున్న మహిళలు

నంద్యాల(వ్యవసాయం): శ్రావణమాసం నాగపంచమిని పురస్కరించుకొని భక్తులు సోమవారం ఉపవాస దీక్షలతో ఉదయాన్నే జంట నాగులకు పాలు పోసి మొక్కులు తీర్చుకున్నారు. పట్టణంలోని పార్కు రోడ్డులోని పాలిటెక్నిక్ కళాశాల, శ్రీమద్దిలేటి లక్ష్మీనరసింహస్వామి, నాగలింగేశ్వరస్వామి, కాళికాంబ చంద్రశేఖర, బైటిపేట ఆంజనేయస్వామి, సంజీవ నగర్ రామాలయంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు పసుపు, కుంకుమ, గాజులు వాయినాలుగా ఒకరికొకరు పుచ్చుకున్నారు.

విజిలెన్స్ తనిఖీలు

శిరివెళ్ల: మండలంలో సోమవారం ట్రాన్స్‌కో విజిలెన్స్ తనిఖీలు జరిగాయి. ట్రాన్స్ ఏడీఏ ప్రసాద్ ఆధ్వర్యంలో ఏఈ శ్రీనివాసులు రెడ్డి బృందం మండల కేంద్రం శిరివెళ్ల, యర్రగుంట్లలో తనిఖీలు చేశారు. గృహ విద్యుత్ మీటర్లు, దుకాణాలు, కూల్ డ్రింక్స్ దుకాణాల్లో తనిఖీ చేపట్టారు. విద్యుత్ చౌర్యం, రెండు మీటర్లు ఉండి ఒకే బిల్లు రావడంపై ఎక్కువగా తనిఖీలు జరుగుతున్నాయని అధికారులు తెలిపారు.

వీరభద్రస్వామికి ప్రత్యేక పూజలు

నంద్యాల(వ్యవసాయం): శ్రావణ సోమవారాన్ని పురస్కరించుకొని స్థానిక బైర్మల్‌వీధిలోని వీరభద్రస్వామి దేవాలయంలో సోమవారం వీరభద్రస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామునే స్వామి వారి మూలవిరాట్‌కు సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు, గంధాభిషేకం తదితర పూజలు చేపట్టారు. అనంతరం మహామంగళ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

జీవకోటికి నీరే ప్రాణాధారం



రామకృష్ణారెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): జీవకోటికి నీరే ప్రాణాధారమని, మానవాళి మనుగడ, అభివృద్ధి, నాగరిత తదితరాలు నీటి ఆధారంగా జరిగాయని ఎస్కే యూనివర్సిటీ విశ్రాంత ఫిజిక్స్ ప్రొఫెసర్ ఆర్.రామకృష్ణారెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక రామకృష్ణ డిగ్రీ కళాశాలలో చైర్మన్ రామకృష్ణారెడ్డి అధ్యక్షతన నీటి రక్షణ అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. ఆధునిక యుగంలో తరుముకొస్తున్న నీటి సంక్షోభానికి మనిషి ఆలోచనలే కారణమని, తన సౌకర్యాల కోసం పర్యావరణానికి తీరని హాని చేస్తున్నాడన్నారు. జలవనరులను జాగ్రత్తగా కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని చెప్పారు. వెంకటేశ్వర్లు, నాగరాజు, చెన్నకేశవరావు, సల్మా పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ప్రమోషన్లు కల్పించాలి



మాట్లాడుతున్న చంద్రశేఖర్

నంద్యాల(న్యూటౌన్): ఉపాధ్యాయులకు జేఎల్ ప్రమోషన్లు కల్పించాలని, ప్రభుత్వ కళాశాలల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలని ఎస్టీయూ రాష్ట్ర సహాయ అధ్యక్షుడు చంద్రశేఖర్ కోరారు. సోమవారం స్థానిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉత్తర్వులు ప్రకారం ఖాళీగా ఉన్న 50శాతం పోస్టులు డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా భర్తీ చేయాలని, బోధనేతర ఉద్యోగుల ద్వారా 40 శాతం పోస్టులను పాఠశాలలో పనిచేస్తున్న అర్హత ఉన్న ఉపాధ్యాయులకు కేటాయించాలని పేర్కొన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

రుద్రవరం: మండలంలోని చందలూరు గ్రామానికి చెందిన ఓబులేసు సోమవారం పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబ సమస్యలతో మనస్తాపానికి గురై ఇంట్లో ఉన్న పురుగు మందు తాగి అపస్మారక స్థితిలో పడిఉండగా గమనించిన కుటుంబ సభ్యులు 108 వాహనంలో ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యాలకు తరలించి చికిత్స చేయించినట్లు గ్రామస్తులు తెలిపారు.

పంచాయతీలుగా గుర్తించాలి

నంద్యాల(అర్బన్): జిల్లాలోని దళిత వాడలను ప్రత్యేక పంచాయతీలుగా గుర్తించాలని ఏపీ దళిత సమాఖ్య జిల్లా అధ్యక్షుడు కృష్ణ, మండల అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ కోరారు. దళిత వాడల్లో విద్య, వైద్యం, సాగుభూమి తదితర మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ సోమవారం స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ అన్యాక్రాంతమైన అసైన్డ్ భూముల వివరాలు ప్రకటించాలని డిమాండ్ చేశారు.

సంక్షేమం, అభివృద్ధితోనే పంచాయతీ ఉప ఎన్నికల్లో గెలుపు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పా రవి.



వైఎస్సార్ నగర్‌లో వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పా

నంద్యాల: నిర్వహించిన ప్రతి ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీపై ప్రజలు తమకున్న అభిమానాన్ని ఓట్ల రూపంలో చూపిస్తూ టీడీపీ నాయకులకు బుద్ధి చెబుతున్నారని, ఈ ఫలితాలు చూసి అయినా ప్రతిపక్ష నాయకుల్లో మార్పు రావాలని ఎమ్మెల్యే శిల్పారవిచంద్రకిశోర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం పట్టణంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో జరుగుతున్న సంక్షేమ, అభివృద్ధి పనులు, పారదర్శక పాలన చూసి ప్రజలు తమ విశ్వాసం, నమ్మకాన్ని ఓట్ల రూపంలో చూపిస్తున్నారన్నారు. పంచాయతీ ఉప ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ మద్దతుదారులకు కనీస ఆదరణ కరువైందని, ఇందుకు ఆ పార్టీ పట్ల ప్రజల్లో ఉన్న అపనమ్మకమే కారణమన్నారు. అందుకే వారిని ఎన్నుకోవడం లేదని చెప్పారు. 66 సర్పంచ్ స్థానాల్లో పోటీ చేయగా 53 స్థానాల్లో వైఎస్సార్‌సీపీ మద్దతు దారులను ప్రజలు గెలిపించారన్నారు. అలాగే 1,062 వార్డుల్లో 756వార్డులు ఏకగ్రీవం కాగా 243 స్థానాల్లో జరిగిన ఎన్నికల్లో 150 స్థానాల్లో తమ పార్టీ మద్దతు దారులు గెలిచారన్నారు. పాదయాత్ర పేరుతో లోకేష్, వారాహి జపం చేస్తూ పవన్ కల్యాణ్, ప్రాజెక్టు యాత్ర పేరుతో చంద్రబాబు పర్యటిస్తున్నా జనం నమ్మడం లేదన్నారు. వచ్చే ఎన్నికల తరువాత వీరంతా తీర్థ యాత్రలకు వెళ్లాల్సిందేనని ఎద్దేవా చేశారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ప్రభంజనం ఇలాగే కొనసాగుతుందన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా, వైస్ చైర్మన్ పాంషావలి, మార్కెట్‌యార్డు చైర్మన్ మహేశ్వరరెడ్డి, రాష్ట్ర డైరెక్టర్లు చంద్రశేఖర్, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

ప్రతి గడపలో సంక్షేమ సంబురం

నంద్యాల(సిటీ): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందజేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతి గడపలో సంతోషం వెల్లివిరిస్తోందని ఎమ్మెల్యే శిల్పా రవి చంద్రకిశోర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని 38వ వార్డు వైఎస్సార్ నగర్‌లో కౌన్సిలర్ సావిత్రమ్మ, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జ్ టీ.వీ రమణతో కలిసి గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లిన ఎమ్మెల్యే శిల్పారవికి వార్డు మహిళలు హారతులు పట్టి స్వాగతం పలికారు. ఎమ్మెల్యే స్థానికులతో ముచ్చటించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలోని ప్రతి గడపకూ అర్హత ఆధారంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని, గతంలో ఇలా ఏ ప్రభుత్వం చేసిన దాఖలాలు లేవన్నారు. అలాగే అన్ని వార్డుల్లో నూతన సీసీ రోడ్లు, డ్రైన్లు నిర్మిస్తున్నామన్నారు. గత నాయకుల నిర్లక్ష్యంతో విస్మరించిన వైఎస్సార్ నగర్‌ను అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని చెప్పారు. ప్రాధాన్యత కలిగిన సమస్యలను ముందుగా గుర్తించి వాటిని పరిష్కరించేందుకు చర్యలు చేపట్టామన్నారు. ప్రతి వార్డు అభివృద్ధికి రూ.20 లక్షలు మంజూరు చేస్తారని, దీంతో సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. పారదర్శక పాలనలో దేశానికే ఆదర్శంగా నిలుస్తుంటే.. ప్రతిపక్షాలు మాత్రం బురద జల్లే రాజకీయాలు చేస్తున్నాయని మండిపడ్డారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ షేక్ మాబున్నిసా, ఆప్కో డైరెక్టర్ సుబ్బరాయుడు, మున్సిపల్ వైస్ చైర్మన్ పాంశావలి, నాయకులు అంకాలయ్య, బాబురావు, నరసింహారావు శెట్టి, తిరుపతయ్య, జాకీర్‌హుసేన్, అన్వర్‌బాషా, రామకృష్ణారెడ్డి, ప్రసాద్‌రెడ్డి, పుల్లమ్మ, వెంకటస్వామి శెట్టి, ఆచారి, రాము, ఉమాకాంతయ్య, బాబు, చిరు, శివ, గోరే, ముర్తుజా, చెన్నప్ప పాల్గొన్నారు.

మాది రైతు ప్రభుత్వం



జలకళ పథకం ద్వారా రైతులకు మంజూరైన మోటారు పంపులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గంగుల

చాగలమర్రి: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆధ్వర్యంలోని ప్రభుత్వం రైతుల పక్షపాతి అని, వారి అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక కన్యకాపరమేశ్వరి కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు పత్రాల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తహసీల్దార్ సుభద్రమ్మ అధ్యక్షతను ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతుల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రభుత్వం రీ సర్వే చేపట్టిందని చెప్పారు. డ్రోన్ల సహాయంతో భూముల రీ సర్వే నిర్వహించి, వారి భూములకు హద్దులు ఏర్పాటు చేసి సర్వే రాళ్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇప్పటికే మండలంలో చాగలమర్రి, మల్లెవేముల, పెద్దవంగలి, చిన్నవంగలి, డి.వనిపెంట, ముత్యాలపాడు గ్రామాలలో రీ సర్వే పూర్తయ్యిందన్నారు. ప్రస్తుతం చాగలమర్రి-1,037 మందికి, మల్లెవేములలో-632 మందికి భూహక్కు పత్రాలు మంజూరయ్యాయన్నారు. అనంతరం ఐదుగురుచిన్న, సన్న కారురైతులకు జలకళ పథకం కింద బోర్లు వేయించుకున్నారు. వారికి రూ.3.93లక్షల విలువజేసే విద్యుత్ సబ్ మెర్సిబుల్ మోటారు, పంపుసెట్టు, తీగ, స్టార్టర్ తదితర సామగ్రి మంజూరైంది. దీంతో వారికి ఎమ్మెల్యే వాటిని అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ బాబులాల్, మండల కన్వీనర్ జి.కుమార్‌రెడ్డి, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు గణేశ్‌రెడ్డి, ఎంపీపీ వీరభద్రుడు, వైస్ ఎంపీపీ ముల్లా.రఫీ, సర్పంచ్ తులసమ్మ, ఎంపీటీసీలు పత్తినారాయణ, లక్ష్మీరెడ్డి, ఫయాజ్, సింగిల్ విండో అధ్యక్షుడు దస్తగిరి, సాగునీటి సంఘం అధ్యక్షుడు శేషు రమేష్, నాయకులు వెంకటరమణ, బచ్చు సుబ్రహ్మణ్యం, ముల్లా ఖాదర్‌బాషా, సయ్యద్‌మాబు, అధికారులు పాల్గొన్నారు.

క్రీడల అభివృద్ధికి కృషి



ఇండోర్ స్టేడియం నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

ఆళ్లగడ్డ: రాష్ట్ర ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తుందని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. స్థానిక వైపీపీఎం ప్రభుత్వ కళాశాల ఆవరణలో నూతనంగా రూ. 1.26 కోట్లతో నిర్మించనున్న ఇండోర్ స్టేడియం నిర్మాణానికి సోమవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత అంతర్జాతీయ క్రీడాకారులుగా తయారు కావలన్న లక్ష్యంతో క్రీడలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. నియోజకవర్గంలోని యువతీ, యువకులు నిరంతర సాధన, శిక్షణతో ఉన్నతస్థాయి క్రీడాకారులుగా ఎదిగేందుకు ఇండోర్ స్టేడియం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. వీలైనంత త్వరగా నిర్మాణం పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని అధికారులు, కాంట్రాక్టర్లకు సూచించారు.

ఉచిత విత్తన కిట్ల పంపిణీ



విత్తనాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

గోస్పాడు: ప్రకృతి వ్యవసాయం చేసే ఎస్సీ రైతులకు ఉచిత విత్తన కిట్లను సోమవారం అందజేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వ్యవసాయ సలహా మండలి చైర్మన్ జనార్దన్‌రెడ్డి, ఏఓ స్వప్నిక ఆధ్వర్యంలో విత్తనాలను పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయం సాగు చేసే రైతులను ప్రోత్సహించేందుకు విత్తన కిట్లను ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. మండలంలోని దీబగుంట్ల, సాంబవరం గ్రామాల్లో 34మంది ఎస్సీ రైతులు ప్రకృతి వ్యవసాయం కింద పైర్లు సాగు చేస్తున్నారన్నారు. విత్తన కిట్లులో జొన్న, కందులు, కొర్ర, మినుము, నువ్వులు, పొద్దుతిరుగుడు, జీలుగ, మొక్కజొన్న, సజ్జలు, రాగులతో పాటు వేరుశనగ విత్తనాలు ఉన్న 13 కిలోల కిట్టును ఒక్కో రైతులకు ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో అందజేసినట్లు చెప్పారు. రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సర్పంచ్ ఐజయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు బోరెడ్డి శంకర్‌రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ జూనియర్ అసిస్టెంట్ ఆచారి, ఏఈఓ రామకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాసరావు

నంద్యాల(వ్యవసాయం): సెప్టెంబర్ 9వ తేదీన జరిగే జాతీయ మెగా లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి శ్రీనివాసరావు, ఉమ్మడి జిల్లా లోక్‌అదాలత్ చైర్మన్ వెంకట నాగ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. సోమవారం కోర్టు ఆవరణలో సీనియర్ న్యాయవాదులు, జిల్లా పోలీసు అధికారులతో వేర్వేరుగా సమీక్ష సమావేశం నిర్వహించారు. లోక్‌అదాలత్‌లో రాజీ పడే క్రిమినల్, సివిల్, భూ తగాదాలు, మోటారు వెహికల్ యాక్సిడెన్స్, వివాహ, కుటుంబ తగాదా కేసులు, చెక్‌బౌన్స్, ఎక్సైజ్, ప్రీ లిటికేషన్ కేసులు, ఇరుపక్షాల ఆంగీకారంతో పరిష్కరించేందుకు న్యాయవాదులు, పోలీసులు సహకరించాలని కోరారు. జాతీయ లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకొని కక్షిదారులు తమ కేసుల వివరాలను సంబంధిత కోర్టులో తెలియపరిచి రాజీ కుదుర్చొని కోర్టుల చుట్టూ తిరగకుండా ప్రశాంతమైన జీవనాన్ని కొనసాగించాలన్నారు. రాజీ పడే కక్షిదారులు, న్యాయవాదులతో కోర్టులకు నేరుగా హాజరు కావచ్చని చెప్పారు. బార్ అసోసియేషన్ నాయకులు కోర్టు ఆవరణలో అదనపు కోర్టులు ఏర్పాటు చేయాలని బ్యాంకు, తదితర ఇతర సమస్యలపై జిల్లా జడ్జికి విన్నవించారు. అనంతరం కోర్టు కార్యాలయంలోని రికార్డులను తనిఖీ చేసి సలహాలు, సూచనలు చేశారు. మూడవ అదనపు జిల్లా జడ్జి వాసు, బార్ అసోసియేషన్ నాయకులు విజయశేఖర్‌రెడ్డి, రఘుప్రకాష్, ప్రతాపరెడ్డి, కృష్ణలింగయ్య, రామ్మోహన్‌రెడ్డి, మనోహర్ రెడ్డి, సత్యనారాయణ పాల్గొన్నారు.

1998 క్వాలిఫైడ్‌లందరికీ ఉద్యోగాలు ఇవ్వాలి



కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): 1998 డీఎస్సీ క్వాలిఫైడ్స్ అందరికీ ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ఆ సంఘం నంద్యాల జిల్లా నాయకులు రమణ, డేవిడ్ బాబు కోరారు. సర్టిఫికేట్ వెరిఫికేషన్ పూర్తయిన క్వాలిఫైడ్‌లందరికీ ఉద్యోగాలు కల్పించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలంటూ సోమవారం జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 6,754 మంది సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేసుకోగా కేవలం 4,072 మందికి మాత్రమే ఉద్యోగాలు ఇచ్చారన్నారు. మిగిలిన 2,300 వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించి వారి కుటుంబాల్లో వెలుగులు నింపాలని విజ్ఞప్తి చేశారు. సంఘం నాయకులు మధుబాబు, జాన్‌బాబు, కేషాలు, రామాంజనేయులు, మోహన్‌రాజు, రామన్న పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

నంద్యాల(న్యూటౌన్): దేశాన్ని రక్షించండి అనే నినాదంతో సీపీఐ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో జరిగే బస్సు యాత్రలో భాగంగా సెప్టెంబర్ 1న రాష్ట్ర సాగునీటి ప్రాజెక్టుల సాధన కోసం నంద్యాలలో జరిగే రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి రంగనాయుడు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక కార్యాలయంలో సీపీఐ రాష్ట్ర జాత పోస్టర్‌ను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ బీజేపీ పాలనలో దేశ ప్రజలకు రక్షణ లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. బాబాఫకృద్దీన్, ప్రసాద్, నాగరాముడు, సంజీవులు, సోమన్న పాల్గొన్నారు.

ఉద్యోగాల పేరుతో మోసం..అరెస్ట్

ఆళ్లగడ్డ: కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న జాతీయ ఆరోగ్య మిషన్ ఆయుష్మాన్‌భారత్ విభాగంలో ఉద్యోగాలు ఇప్పిస్తామని నిరుద్యోగులను మోసం చేసిన తల్లి, కుమార్తెను పట్టణ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. పట్టణ సీఐ రమేష్ బాబు తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని నల్లబోతుల జయలక్ష్మి, ఆమె కూతురు నల్లబోతుల మధులత.. షేక్ జాకీర్ హుసేన్, మరి కొందరు నిరుద్యోగ యువకులకు ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మించి సుమారు రూ.30 లక్షల వరకు డబ్బులు వసూలు చేశారు. కొన్ని రోజుల పాటు ఏవో కాగితాలు ఇచ్చి ఉద్యోగాలకు ఎంపికయ్యారని త్వరలో కాల్ లెటర్‌లు వస్తాయని, ఎక్కడ జాయిన్ కావల్సింది అందులో ఉంటుందని నమ్మబలికారు. సంవత్సరాలు గడిచినా కాల్ లెటర్ రాక పోవడంతో వారిని నిలదీశారు. దీంతో వారి నుంచి సమాధానం కరువవడంతో జాకీర్ హుసేన్ పట్టణ పోలీసులు ఆశ్రయించాడు. కేసు నమోదు చేసుకున్న సీఐ విచారణ చేపట్టి నిందితులను అరెస్ట్ చేసి కోవెలకంట్ల కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించారని సీఐ వివరించారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో జైలు శిక్ష

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలో మద్యం సేవించి వాహనాలు నడిపిన నిందితుడికి సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ రామిరెడ్డి గారి రాంభూపాల్‌రెడ్డి జైలుశిక్ష ఖరారు చేశారని పోలీసులు సోమవారం తెలిపారు. వివరాలు.. ట్రాఫిక్ పోలీసులు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో రమేష్ మద్యం సేవించి మోటారు సైకిల్ నడిపినందుకు పోలీసులు అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచగా ఏడు రోజులు జైలు శిక్ష ఖరారు చేసినట్లు చెప్పారు.

ఐటీఐలో మూడో విడత అడ్మిషన్లు

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల ప్రభుత్వ ఐటీఐలో 2023–24 విద్యాసంవత్సరానికి మొదటి, రెండు విడతల్లో మిగిలిన అడ్మిషన్లను మూడో విడత భర్తీకి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పి.ప్రసాద్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 22 నుంచి 27వ తేదీ వరకు జ్టీజీ. ౖఇ. జౌౖ. జీ లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న వారు 28వ తేదీ లోగా నంద్యాల ప్రభుత్వ ఐటీఐలో వెరిఫికేషన్ చేయించుకుని 30న జరిగే కౌన్సెలింగ్‌కు హాజరు కావాలన్నారు. వివరాలకు 9666712370, 9000767816ను సంప్రదించాలన్నారు.

మహానందీశ్వరుడికి పల్లకీసేవ

మహానంది: మహానందిలో కొలువైన శ్రీ కామేశ్వరీ దేవి, మహానందీశ్వరస్వామి దంపతులకు శ్రావణ మాసం, సోమవారం రాత్రి పల్లకీసేవ నిర్వహించారు. కార్యక్రమంలో కర్నూలు జిల్లా న్యాయమూర్తి శ్రీనివాసరావు దంపతులు పాల్గొన్నారు. వేదపండితులు, అర్చకుల ఆధ్వర్యంలో స్వామి,అమ్మవార్లను విశేషంగా అలంకరించి పల్లకీలో కొలువుచేసి ఆలయ ప్రాకారాల్లో ఊరేగించారు.

పాణ్యం గురుకుల పాఠశాలల ఆకస్మిక తనిఖీ



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న పీఓ రవీంద్రారెడ్డి

శ్రీశైలంప్రాజెక్టు/పాణ్యం: మండల కేంద్రం సమీపంలోని నెరవాడమెట్టవద్దనున్న బాలికల గురుకుల పాఠశాల, మినీ గురుకులాను సోమవారం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి డాక్టర్ బి.రవీంద్రారెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలల్లోని డిజిటల్ క్లాస్ రూంలో విద్యా బోధనను పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న ఆహారపదార్థాలను రుచి చూశారు. విద్యార్థుల విద్యాప్రమాణాలను మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులు అంకిత భావంతో పనిచేయాలని, వారి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. మరుగుదొడ్ల నిర్వహణ, రన్నింగ్ వాటర్, వసతిగృహంలో లోపాలను గమనించి అసహనం వ్యక్తం చేశారు. డార్మిటరీలో దోమలు రాకుండా విండోమెష్‌లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రహరీ నిర్మాణానికి డైరెక్టర్‌కు ప్రతిపాదనలు పంపుతామని చెప్పారు. విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత స్థానాలు చేరుకోవాలని సూచించారు.

ఆర్‌బీకేలకు ఎరువుల సరఫరా



శిరివెళ్ల ఆర్బీకే-1లో ఎరువుల నిల్వలు

శిరివెళ్ల: మండలంలోని రైతు భరోసా కేంద్రాలకు ఎరువులు సరఫరా అయ్యాయి. వాటిని సిబ్బంది రైతులకు అందజేస్తున్నారు. డీఏపీ, యూరియా ఎరువులు అందుబాటులో ఉన్నాయి. గుండంపాడు ఆర్‌బీకేకు డీఏపీ10 టన్నులు, ఎన్ఎఫ్‌సీఎల్ యూరియా11.97 టన్నులు, మహదేవపురం ఆర్బీకేకు యూరియా 34 టన్నులు, గంగవరంకు యూరియా11.97, డీఏపీ 24 టన్నులు సరఫరా అయ్యాయి. బోయలకుంట్లకు యూరియా 9.99 టన్నులు, చెన్నూరు డీఏపీ 20 టన్నులు, 32 టన్నుల యూరియా, కోటపాడుకు డీఏపీ10, యూరియా 23 టన్నులు, జీనేపల్లెకు యూరియా 10 టన్నులు గుంప్రమాన్‌దిన్నెకు డీఏపీ10 టన్నులు వచ్చాయి. యర్రగుంట్లకు డీఏపీ10, యూరియా11,97 టన్నులు, గోవిందపల్లెకు డీఏపీ 10 టన్నులు యూరియా 20 టన్నులు చేరాయి. అవసరమైన రైతులు ప్రభుత్వం నిర్ణయించిన ధరకు కొనుగోలు చేయాలని అధికారులు సూచించారు.

26న వీరభద్రస్వామి కల్యాణోత్సవం

నంద్యాల(అర్బన్): పోలూరు గ్రామంలో వెలసిన శ్రీభద్రకాళి సమేత వీరభద్రస్వామి ద్వాదశ కల్యాణ మహోత్సవాన్ని ఈనెల 26వ తేదీన వైభవంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ..కల్యాణోత్సవాల్లో భాగంగా.. 26న ఉదయం 8.30గంటలకు గోపూజ, గణపతి పూజ, పుణ్యాహవాచనం, కంకణధారణ, రుద్రహోమం నిర్వహిస్తారని, 27న స్వామి వారి లీల కల్యాణ మహోత్సవం ఉంటుందని చెప్పారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

నేటి నుంచి మొబైల్ ఆధార్ సేవలు

దొర్నిపాడు: మండలంలో గ్రామ సచివాలయాల్లో మొబైల్ ఆధార్ సేవలను మంగళవారం నుంచి నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సుబ్బారెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 22న దొర్నిపాడు, గుండుపాపల, 23న బుర్రారెడ్డిపల్లె, ఉమాపతినగరం, 24న చాకరాజువేముల, డబ్ల్యూగోవిందిన్నె, 25న కొండాపురం,డబ్ల్యూ.కొత్తపల్లె సచివాయాల్లో సేవలు అందుతాయన్నారు. డిజిటల్ అసిస్టెంట్లు సౌజన్య, నాగేశ్వరరావు ఆధార్ కార్డుల్లో మార్పులు చేర్పులు చేస్తారని స్థానికులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

చాగలమర్రి: మండలంలోని గ్రామాల్లో ఈ నెల 22 నుంచి 25వ తేదీ వరకు ఆధార్ ప్రత్యేక క్యాంపులు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ మహబుబ్‌దౌలా తెలిపారు. సోమవారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ 22న మల్లెవేముల, చింతలచెరువు, 23న శెట్టివీడు, మద్దూరు, 24న పెద్దబోధనం, నేలంపాడు, ముత్యాలపాడు-2, చిన్నవంగలి, పెద్దవంగలి, 25 గొడిగనూరు, ముత్యాలపాడు-1, సచివాలయ కార్యాలయాలలో ఆధార్ క్యాంపులు ఏర్పాటు చేస్తామని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సమస్యలు పరిష్కరించాలి

నంద్యాల(న్యూటౌన్): ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ 23వ తేదీన ఫ్యాప్టో ఆధ్వర్యంలో విజయవాడ కమిషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ కార్యాలయం ఎదుట జరిగే 12 గంటల ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఫ్యాప్టో జిల్లా చైర్మన్ మాధవస్వామి, జనరల్ సెక్రటరీ సుబ్బన్న కోరారు. సోమవారం స్థానిక కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ జీవోనెం.117 రద్దు చేయాలని, ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని, వేతనాల చెల్లింపులో జాప్యాన్ని నివారించాలని కోరారు. నాయకులు శివయ్య, ప్రసాద్, నగరి శ్రీనివాసులు, దస్తగిరి, జమాన్, శ్రీనివాసులు, గోపాలకృష్ణ, చంద్రశేఖర్, రామకృష్ణయ్య పాల్గొన్నారు.

ఫారం ఆస్తుల జోలికొస్తే ఉపేక్షించం



చెట్టు కూల్చివేతపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఫారం ఏడీఏ అరుణలత

జూపాడుబంగ్లా: తంగడంచ ఫారం ఆస్తులను ఆక్రమించినా, ధ్వంసం చేసినా అందుకు బాధ్యులైన వారిని ఉపేక్షించేదిలేదని ఫారం ఏడీఏ అరుణలత తెలిపారు. సోమవారం ఫారం స్థలంలో ఉన్న సుమారు 20ఏళ్ల నీలగిరి వృక్షాన్ని ఎలాంటి అనుమతుల్లేకుండా కూల్చివేశారు. విషయం తెలుసుకున్న ఏడీఏ కూల్చిన చెట్టును పరిశీలించారు. ఎవరు చెట్టును కూల్చారు, మీకేమైనా అనుమతులున్నాయా అంటూ హౌసింగ్ ఏఈ జ్యోతిని ప్రశ్నించారు. చెట్టుకూల్చివేయాల్సిన అవసరం తలెత్తినప్పుడు విషయాన్ని తహసీల్దార్ లేక తమ దృష్టికి తేవాల్సి ఉండగా ఇష్టానుసారంగా చెట్టును కూల్చటం తగదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెకలించిన చెట్టును ఎవరూ తీసుకెళ్లవద్దని సూచించారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ తంగడంచ ఫారం స్థలం ఆక్రమణకు గురైనట్లు తమ దృష్టికి వచ్చిందని, స్థలాన్ని త్వరలో కొలతలు వేయించి ఆక్రమణకు గురైన వాటిని వెంటనే ఖాళీ చేయించి ఫారం స్థలాన్ని స్వాధీనం చేసుకుంటామని ఆమె స్పష్టం చేశారు.

మహానందిలో కొనసాగుతున్న భక్తజన సందడి

మహానంది: మహానంది పుణ్యక్షేత్రంలో శ్రావణ మాసం, సోమవారం నాగపంచమి సందర్భంగా భక్తులరద్దీ కొనసాగుతోంది. వేకువజాము నుంచి భక్తులు ఆలయానికి చేరుకుని స్థానిక కోనేరులలో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకున్నారు. సుమారు యాభైకి పైగా అభిషేకాలు జరిగాయి. స్వామి,అమ్మవారి దర్శనానికి గంటల తరబడి సమయం పట్టింది. వేకువజామున ప్రారంభమైన స్వామి,అమ్మవారి దర్శనం రాత్రి ఏకాంత సేవ వరకు నిర్విరామంగా కొనసాగింది.